సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- ఆరో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం


మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: సంక్షేమ పథకాలను అందించటంతో పాటు ప్రతి గడపలోని సమసల్ని పరిష్కరించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆరో వార్డు బోసురోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ఆరో వార్డు ఇన్‌చార్జిలు పోతిరెడ్డి హేమలత, పోతిరెడ్డి నాగరాజుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా సీఎం జగన్ ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి అగ్రవర్ణాలలోని పేదలకు ఆర్థిక చేయుతను ఇస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతుందన్నారు. ఆరో వార్డులో మొత్తం జనాభా 3,053, ఇళ్లు 1243 వార్డులో ఇప్పటివరకు రూ.14.62కోట్ల నగదును సంక్షేమం కింద ప్రజలకు అందజేసినట్లు తెలిపారు. అమ్మఒడి 405, వైఎస్సార్ ఆసరా 303, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన 212, వైఎస్సార్ సున్నా వడ్డీ 402 మంది ఇచ్చినట్లు చెప్పారు. వార్డులో ఇప్పటివరకు రూ.16లక్షలతో అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, కౌన్సిలర్‌లు షేక్ దుబాయ్ బాబు, యాతాటి అనీల్, మల్లిబోయిన సువర్ణరేఖాదేవి, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, సర్పంచ్‌లు భాషా, దూళ్ళిపాళ్ల పవన్ కుమార్, రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మలా, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, ఆరోవ వార్డు నాయకులు పోతిరెడ్డి రవీంద్రనాథ్, సీఖేరారెడ్డి, పోతిరెడ్డి శ్రీకర్, వాసు, రెడ్డి తివారి, గోల్డు సుభాని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకట్రామయ్య మృతి తీరని లోటు

తెనాలి: మహాత్మా జ్యోతిబా పూలే సామాజిక అధ్యయన కేంద్రం ప్రధాన కార్యదర్శి మునిపల్లి వెంకట్రామయ్య సంతాప సభను బుధవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యయన కేంద్రం అధ్యక్షుడు దాలిపర్తి ధనుంజయరావు అధ్యక్షత వహించారు. మూడు దశాబ్దాలుగా సంస్థ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన వెంకట్రామయ్య మృతి బడుగు బలహీనవర్గాలకు తీరని లోటని పేర్కొన్నారు. ఇంటూరి వెంకటేశ్వరరావు, కొడాలి రాఘవయ్య, దాలపర్తి దత్తాత్రేయ, దాలిపర్తి వెంకట సుబ్బలక్ష్మి, మునిపల్లి హరిబాబు పాల్గొన్నారు.

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీలు



తెనాలిఅర్బన్: ప్రభుత్వం నిర్దేశించిన జాబ్ కార్డు ప్రకారం ప్రతి ఒక్కరు విధులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు సూచించారు. పట్టణంలోని 6,7 సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అలాగే అందరు సమయ పాలన పాటించాలని సూచించారు. పనివేళలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. సేవలలో ఎటువంటి లోపాలు కన్పించిన సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

హార్మోనిస్ట్ రమేష్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం శ్రీ కృష్ణ సత్య చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం బ్రహ్మర్షి విశ్వామిత్ర చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ హార్మోనిస్ట్ కొల్లేటి రమేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెమ్మసాని పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, పాలడుగు ప్రసాద్, పాలడుగు మల్లేశ్వరరావు, తరణి హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు దుస్తులు పంపిణీ



తెనాలిటౌన్: పట్టణ సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం మార్కెట్ కమిటీ పాలకవర్గ మెంబర్లతో సమావేశం జరిగింది. సమావేశానికి మార్కెట్ కమిటీ చైర్మన్ అవుతు సీతనగేష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. మార్కెట్ యార్డులో పనిచేసే హమాలీలకు నూతన సంవత్సరం సందర్భంగా దుస్తులను ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ సీతనగేష్‌రెడ్డిలు అందజేశారు. కమిటీ కార్యదర్శి జేవీ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ కొల్లిపర మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, కమిటీ వైస్ చైర్మన్ వంపుగళ్ల కృష్ణ, పాలకవర్గ మెంబర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీల రాకపోకలపై ఆంక్షలు సడలింపు

తెనాలిరూరల్: పట్టణంలోకి లారీల రాకపోకలపై ఆంక్షలను సడలించినట్టు ట్రాఫిక్ ఎస్ఐ జె.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లారీలు ఉదయం ఎనిమిది గంటల్లోపు పట్టణంలోకి వచ్చి తొమ్మిది గంటలకు బయటకు వెళ్లిపోవాలని, మధ్యాహ్నం ఒటి గంట నుంచి మూడు గంటల వరకు రావచ్చని, రాత్రి 8.30 గంటల తర్వాతే లారీలను పట్టణంలోకి అనుమతిస్తామన్నారు. కొత్త ఆంక్షలు గురువారం నుంచి అమల్లోకి వస్తాయన్నారు. వ్యాపారులు గమనించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సహకరించాలని కోరారు.

ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని జీఆర్పీ పోలీసులు బుధవారం గుర్తించారు. తెనాలి రైల్వేస్టేషన్‌లోని మూడో నంబరు ప్లాట్‌ఫాంపై ఉన్న వెయిటింగ్ హాలు వద్ద సుమారు 70 ఏళ్ల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు తెల్ల బనియన్, ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. జీఆర్పీ ఎస్ఐ ఎల్.సరస్వతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్ అథ్లెటిక్ సీతారామమూర్తికి సత్కారం


సీతారామమూర్తిని సత్కరిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

తెనాలిటౌన్: పట్టణ ఐతానగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, జాతీయస్థాయి క్రీడాకారుడు దీవి సీతారామమూర్తిని బుధవారం కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో నాయకులు సత్కరించారు. ఇటీవల నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన 41వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో 65 సంవత్సరాల విభాగంలో పాల్గొని లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లలో రెండు బంగారు పతకాలు సాధించడం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు సీతారామమూర్తిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మాచిరాజు రామకృష్ణమూర్తి, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, గరికపాటి సుబ్బారావు, హృదయరాజు, విశ్రాంత హెచ్ఎం పినపాటి రవికుమార్ పాల్గొన్నారు.

బాగుపడిన బోరుపంపు


బోరుపంపును రిపేరు చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లిరూరల్: కొలనుకొండలో ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉన్న బోరుపంపుకు బుధవారం మోక్షం లభించింది. కార్పొరేషన్ ఇంజనీరింగ్ సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. మంగళగిరి శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డికి స్థానికులు వాట్సాప్ ద్వారా సమస్యను మెసేజ్ చేయడంతో వెంటనే స్పందించిన ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి బోరు పంపును బాగు చేయించారు. కార్పొరేషన్ పరిధిలో ఎన్ని బోరుపంపులు ఉన్నాయి? అవి ఏ పరిస్థితుల్లో ఉన్నాయి? అనేవి సచివాలయంలో ఇంజినీరింగ్ సిబ్బంది వెంటనే పరిశీలించి ఎక్కడెక్కడ మరమ్మతులు నిర్వహించాలో తెలియజేయాలని కోరారు. ఎక్కడా కూడా బోరు పంపుల మరమ్మతులు పెండింగ్‌లో ఉండకూడదని, ప్రతి ఒక్క దానిని బాగు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలియజేశారు. బోరుపంపులు ఎక్కడైనా మరమ్మతులకు గురైతే స్థానిక సచివాలయాల్లో ప్రజలు ఫిర్యాదు చేయాలని డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

అర్హులందరికీ పెన్షన్లు అందజేస్తాం

- నియోజకవర్గంలో కొత్తగా 2,146 పెన్షన్లు
- మంగళగిరి శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి


శ్రీనివాస కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

తాడేపల్లిరూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పెన్షన్ అందుతుందని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం బుధవారం తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవితో కలిసి కొత్తగా పెన్షన్ వచ్చిన లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో, మంగళగిరి నియోజకవర్గంలోనూ ఎక్కడో ఒకచోట అర్హులు కాని వారిని గుర్తించి పెన్షన్ తొలగిస్తే అందరి పెన్షన్లు తొలగిస్తున్నారని ప్రచారం చేస్తున్నారన్నారు. ఒక్క మంగళగిరి నియోజకవర్గంలోనే 2,146 పెన్షన్లు కొత్తగా మంజూరయ్యాయని తెలిపారు. పెన్షన్‌కు అర్హులై ఉంటే రాజకీయ నాయకులతో ప్రమేయం లేకుండా వలంటీర్ ఇంటికే వచ్చి పెన్షన్ అందజేస్తారని తెలిపారు. పేదలకు మేలు చేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ సెక్రటరీ శ్రీనివాసరావు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, ప్రవీణ్, వివిధ సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు కృషి

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. బుధవారం ఆయన నగర పాలక సంస్థ అధికారులతో కలసి నగర పరిధిలోని కాజ రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కాజలోని ఓవర్ హెడ్ ట్యాంకుకు రూ.10 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టడంతో పాటు పంప్ హౌస్ వద్ద సుమారు రూ.15 లక్షల వ్యయంతో నూతన ప్రెషర్ శాండ్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు సురక్షిత తాగునీటిని నిర్ణీత వేళల్లో సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆర్ల రామయ్య, పార్టీ నాయకులు సింహాద్రి కోటిరెడ్డి, నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత సాంబశివరావుపై కేసు నమోదు

మంగళగిరి: తాడేపల్లికి చెందిన టీడీపీ నేత జంగాల సాంబశివరావుపై కేసు నమోదైనట్లు మంగళగిరి రూరల్ పోలీసులు బుధవారం తెలిపారు. నగర పరిధిలోని చినకాకాని వద్ద ఏర్పాటు చేసిన మారుతీ టౌన్‌షిప్‌లో ప్లాట్లు విక్రయించడంలో తమను మోసం చేశారని బాధితులు ఒంటెద్దు కనకయ్య, నందం యశోదకుమార్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ప్లాటు కోసం రూ.40 లక్షలు తీసుకుని జంగాల సాంబశివరావు దగ్గర పని చేస్తున్న మట్టుపల్లి మహేష్ అనే వ్యక్తి తప్పుడు అగ్రిమెంట్లతో తమను మోసం చేసినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మెల్లెంపూడిలో కొవ్వొత్తుల ర్యాలీ



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెంపూడి ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో బుధవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మాజీ పోప్ బెనెడిక్ట్ 16 ఇటీవల మరణించడంతో ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినట్లు సంఘ పెద్దలు విజయ్‌కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి ఉపదేశి బెజ్జం లక్ష్మణరావు, మండె సాల్మన్‌రాజు, పవన్‌కుమార్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థినులతో టీడీపీ నేత కుమారుడి అసభ్య ప్రవర్తన

అదుపులోకి తీసుకున్న పోలీసులు

మంగళగిరి: చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల టీడీపీ నాయకుడు కటారి అప్పారావు కుమారుడు శివసాయి అసభ్యంగా ప్రవర్తించిన ఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన శివసాయిని ఉపాధ్యాయులు అడ్డుకోవడంతో వాగ్వివాదానికి దిగాడు. దీంతో ఉపాధ్యాయులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు వచ్చి శివసాయిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేఎల్‌యూ ఆధ్వర్యంలో జాతీయ క్రీడలు


క్రీడల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేఎల్‌యూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, డీన్ హబీబుల్లా ఖాన్

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో క్రీడల విభాగం ఆధ్వర్యంలో కోనేరు లక్ష్మయ్య మెమోరియల్ ట్రోఫీ–2023 పోస్టర్‌ను బుధవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ విడుదల చేసినట్లు క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగే ఈ జాతీయ క్రీడల్లో పురుషుల విభాగంలో బ్యాడ్మింటన్ సింగిల్, డబుల్, కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్ బాల్, ఖోఖో, చదరంగం పోటీలు నిర్వహిస్తుండగా, మహిళల విభాగంలో చదరంగం, బ్యాడ్మింటన్ సింగిల్, ఖోఖో క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ జాతీయ స్థాయి క్రీడల్లో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు 91776 91248కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

రేపు రామేశ్వరాలయంలో శివముక్కోటి


ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన బదరీ నారాయణ, రమణ కుమారి

తెనాలి: జంగమదేవర అన్నదాన సమాజం, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన సంస్థ 38వ వార్షికోత్సవాలు, స్థానిక శ్రీపర్వతవర్ధినీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర మహోత్సవం (శివముక్కోటి) జరగనున్నాయి. ఆరోజు ఉదయం 9 గంటలకు స్వామివారి ఆలయ ప్రదక్షిణలు ఉంటాయి. మధ్యాహ్నం 12.30 గంటలకు జంగమదేవరలకు (మహేశ్వరులకు) అన్నదాన సమారాధన, వస్త్రదానం ఉంటాయని సమాజం అధ్యక్షుడు మేడా బదిరినారాయణరావు, కార్యదర్శి పీవీ సుబ్బారావు వెల్లడించారు. కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి రమణకుమారి, సమాజం కోశాధికారి వుప్పల వరదరాజులు, ఉపాధ్యక్షుడు వేమూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి పెండేల సుబ్బారావు, కార్యవర్గసభ్యులు యక్కల మాల్యాద్రి, జంధ్యాల సుబ్రహ్మణ్యం, పెనుమూడి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు జైనుల శిఖర్‌జీ రక్షణ ర్యాలీ

తెనాలి: జార్ఖండ్‌లోని పరమ పవిత్రమైన శిఖర్‌జీ ఆలయ పవిత్రతను కాపాడాలనే డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని జైనులు 'సేవ్ శిఖర్‌జీ' పేరుతో ర్యాలీ జరుపనున్నారు. స్థానిక గంగానమ్మపేటలోని జైన్ టెంపుల్ నుంచి ఉదయం 9.30 గంటలకు ర్యాలీగా బయలుదేరి సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్టు బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు. శిఖర్ జీ ఆలయం పవిత్రమైనదనీ, అందులో 20 మంది తీర్థంకరులకు జ్ఞానోదయమైందని జైన సంఘీయులు తెలిపారు. గతంలో వేరొకచోట గల జైనాలయాన్ని పర్యాటక ప్రదేశంగా ప్రభుత్వం ప్రకటించటంతో అక్కడ పవిత్రత దెబ్బతిందన్నారు. అది జైనుల మనోభావాలను గాయపరిచిందని చెప్పారు. అలాంటివి మళ్లీ పునరావృతం కారాదనే భావనతో 'శిఖర్ జీ రక్షణ' ర్యాలీని చేపడుతున్నట్టు వివరించారు. దేశంలోని అన్ని పట్టణాల్లోని జైనులు ఈ విధమైన ప్రదర్శనలతో తమ డిమాండ్‌ను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.

కొనసాగుతున్న వ్రత పూజామహోత్సవాలు


అలంకరణలో స్వామి, అమ్మవార్లు

తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని విద్యాపీఠంలో పూజ్యశ్రీ బాలస్వామీజీ పర్యవేక్షణలో జరుగుతున్న శ్రీ ధనుర్మాస వ్రతపూజామహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రతినిత్యం మేలుకొలుపు గోదారంగనాథులకు సాలిగ్రామాన అభిషేకాలు చేస్తున్నారు. గోదారంగనాథులకు అష్టోత్తర శతనామార్చాన, ఆరగింపు, తిరుప్పావై గోష్టి జరిపారు. ధనుర్మాస వ్రత విశిష్టతను బాలస్వామీజీ భక్తులకు వివరించారు. ఉభయదాతలు చుండూరు లోకనాథం, వరలక్ష్మి దంపతులు, చంతలచెరువు శ్రీనివాసరెడ్డి, లక్ష్మీతిరుపతమ్మ దంపతులు పూజలు నిర్వహించారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, శ్రీవిద్యాపీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్: నిద్రమత్తులో డ్రైవర్ అజాగ్రత్తగా కారు నడపటంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కుంచనపల్లి 16వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. తాడేపల్లి ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల మేరకు.. ఏలూరు జిల్లా ఆగిరిపల్లికి చెందిన గ్రంధి సుబ్రహ్మణ్యం (42) పప్పుల మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఆగిరిపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై పప్పుల మిల్లు పనిపై గుంటూరు బయలుదేరారు. కనకదుర్గ వారధి దాటిన తరువాత కుంచనపల్లి వద్ద కారు అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అనంతరం రోడ్డు డివైడర్‌ను ఢీకొని, ఎదురుగా ఉన్న గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న బాలరాజు నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తాడేపల్లి ఎస్ఐ రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కారు డ్రైవర్ బాలరాజును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి గౌడ కల్యాణ మండపంలో రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో 2023 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్ హాస్పిటల్ డాక్టర్ పలగాని శ్రీనివాసరావు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభాలో బీసీ తరగతుల హక్కులు, ఆర్థిక ప్రయోజనాలు పొందడంలో సఫలీకృతం కాలేకపోతున్నారని చెప్పారు. రాజ్యాధికారం పొందడంలో బీసీ తరగతుల వృత్తిదారులు అందరూ ఐక్యంగా కృషి చేపట్టాలన్నారు. రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర్య ఫలాలు అనుభవించిన తరువాత కూడా రజకులు నేటికీ అణగారిన వర్గంగా దోపిడీకి గురవుతూ, అనేక ప్రాంతాల్లో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బొజ్జ సుబ్బారావు, పాగోలు శ్రీనివాస్, ఈమని నాగలక్ష్మి, జిల్లా నాయకులు ఈమని రామారావు, మోర్ తోట సుబ్బారావు, వల్లభాపురం మస్తాన్‌రావు, ఓలేటి శ్రీను, నూతక్కి సాంబశివరావు, కామరాజు తదితరులు పాల్గొన్నారు.



వడ్డేశ్వరంలో పగిలిన పైప్‌లైన్లు

కార్పొరేషన్ ట్యాంకర్‌ల ద్వారా తాగునీరు సరఫరా



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలో రెండు చోట్ల తాగునీటి పైప్‌లైన్లు పగిలి తాగునీటి సరఫరాకు మంగళవారం అంతరాయం కలిగింది. సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోయిన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. ఎక్కడైనా, ఎప్పుడైనా తాగునీటికి అంతరాయం కలిగితే దగ్గరలోని సచివాలయంలో ఫిర్యాదు చేస్తే తాగునీటిని అందజేస్తామని ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు.

